రైతుల కష్టం వర్షార్పణం

- అకాల వర్షంతో అన్నదాత అతలాకుతలం
- దెబ్బతిన్న వరి, కంది పంటలు
- తడిసిన మొక్కజొన్న దిగుబడులు

రైతుల రెక్కల కష్టం వర్షార్పణమైంది. అకాల వర్షం కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. ఆరబోసుకున్న మొక్కజొన్న దిగుబడులు తడిసిముద్దయ్యాయి. చేతికొచ్చే దశలో ఉన్న వరి, కంది పంటలు నేలకొరగడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపరిహారం అందజేసి ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

బండి ఆత్మకూరు: మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షం కారణంగా వేల ఎకరాల్లో వరి పంట నేలవాలింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి కడమల కాలువ, ఈర్నపాడు, సింగవరం గ్రామాల పరిధిలో వరి పంట నేలవాలింది. శుక్రవారం వ్యవసాయ అధికారులు, సీపీఎం నాయకులు వేర్వేరుగా పంటలను పరిశీలించారు. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని పలువురు రైతులు అధికారులకు విన్నవించారు. కాగా దాదాపు 4,500 ఎకరాల్లో వరి పంట నేల వాలినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.స్వాతి తెలిపారు. పూర్తి స్థాయిలో పరిశీలించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.


వరి పంటను చూపుతున్న రైతులు, సీపీఎం నాయకులు

• **పాములపాడు:** మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 20.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోత దశకు వచ్చిన పైర్లు నెలకొరిగాయి. కోసి ఆరబోసుకున్న పసుపు, మొక్కజొన్న, పొగాకు దిగుబడులు తడిసిపోయాయి. దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్న ఈ సమయంలో తడిసిన ధాన్యాన్ని ఎవరు కొనుగోలు చేస్తారని రైతు నాగమల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.


పాములపాడులో తడిసిన పొగాకు మండె వద్ద రైతులు


బండిఆత్మకూరు సమీపంలో నేలకొరిగిన వరిపైరు


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

• **వెలుగోడు:** మండలంలో 56.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అబ్దుల్లాపురం గుంతకందాల తదితర గ్రామాల పరిధిలో సాగైన వరి, మొక్కజొన్న, మిరప పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పంటలను పరిశీలించారు. 125 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు.

జూపాడుబంగ్లా: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 20.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో తాటిపాడు, తంగడంచ, తరిగోపుల, 80బన్నూరు, భాస్కరాపురం, పారుమంచాల, తూడిచెర్ల గ్రామాల్లో పండుమిరప, కంది, మొక్కజొన్న, వరి పంటలు తడిసిపోయాయి. కొంతమంది రైతులు కోసి కల్లాల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న, పండుమిరప, కందులకు తీవ్ర నష్టంవాటిల్లింది. కోతకోసి నూర్పిడికి సిద్ధంగా ఉంచుకున్న కందిపంట తడిసిపోవటంతో గింజలు రాలిపోయి నల్లగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జూపాడుబంగ్లా సమీపంలో తడిసిన కందిపంట

• **మహానంది:** మండలంలో కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల రెవెన్యూ పరిధిలో సాగైన సుమారు 30 ఎకరాల అరటి తోటల్లోని చెట్లు గాలికి నేలకొరిగాయి. తమ్మడపల్లె, బొల్లవరం, అబ్బీపురం గ్రామాల పరిధిలోని వరి పైర్లకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు వెయ్యి ఎకరాల్లో వరిపైరు నేలవాలినట్లు మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు.

• **పగిడ్యాల:** మండలంలో 12. మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోతకోసి ఆరబెట్టుకున్న కేసీ ఆయకట్టు రైతుల వరి, మొక్కజొన్న, కంది దిగుబడులు తడిసిపోయాయి. ఆరుగాలం కష్టపడినా ప్రకృతి ప్రకోపానికి గురికాక తప్పలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పగిడ్యాల నుంచి నందికొట్కూ రు వరకు బీటీ రోడ్డుకు ఇరువైపులా వర్షపునీరు గుంతల్లో నిండుకుని ప్రయాణానికి తీవ్ర విఘాతంగా మారిందని వాహన చోదకులు ఆందోళన చెందారు. కాగా వేసవి దుక్కులకు ఈ వర్షం ఎంతో దోహదం చేసిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

• **ఆత్మకూరు:** నల్లమల అటవీ డివిజన్ పరిధిలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షం కురిసింది. ఆత్మకూరు మండలంలో 22.1 మి.మీ. వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండువేసవిలో ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు వర్షం ఎంతో ఊరటనిచ్చింది.


వర్షానికి తడిసిన మొక్కజొన్న గింజలను ఆరబెడుతున్న రైతు

క్లుప్తంగా

మహానందీశుడి దంపతులకు పల్లకీసేవ


మహానందిలో స్వామివారికి పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, వేదపండితులు హనుమంతశర్మ, నాగేశ్వరశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి స్థానిక అలంకార మండపంలో ముందుగా శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరంలో మహానందీశుడి దంపతులను పల్లకీలో కొలువు తీర్చి గోమాతలు, నంది బసవయ్యలను ముందుండి నడిపిస్తూ ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు పల్లకీ మోస్తూ మహానందీశ్వరుడిని పూజించారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి


డీఈఈ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: విద్యుత్ సర్దుబాటు పేరుతో వసూలు చేస్తున్న చార్జీలను రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ డివిజన్ కార్యాలయంలో డీఈఈ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరసింహులు, మాబాషా, లక్ష్మిదేవి, మూర్తుజాబీ పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై మహిళలకు అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ జఫ్రుల్లా

నందికొట్కూరు: నాటు సారా నిర్మూలనపై ఎక్సైజ్ ఎస్‌ఐ జఫ్రుల్లా శుక్రవారం మహిళలకు అవగాహన కల్పించారు. నీలిషికారిపేటలో జరిగిన నవోదయ 2.0 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సారా రహిత పట్టణంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి సహకరించాలన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి


సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ కాంతారావు నాయక్

మహానంది: వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఎన్‌సీడీసీడీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్బీఎస్‌కే, ఎన్‌సీడీసీడీ సర్వే నోడల్ అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ తెలిపారు. ఎం.తిమ్మాపురంలో శుక్రవారం చేపడుతున్న సర్వేను పరిశీలించారు. డాక్టర్ కాంతారావు నాయక్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సర్వే చేయాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి చేరుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భగవాన్‌దాస్, ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి, సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు.

బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు: నాటు సారా తయారీ కోసం ఉంచిన 100 లీటర్ల బెల్లం ఊటను శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా తెలిపిన వివరాలు.. స్థానిక నీలిషికారిపేటలో సోదాలు నిర్వహించారు. నీలిషికారి నాగమణి నుంచి 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తయారీ కోసం ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సోదాల్లో ఎక్సైజ్ పోలీసులు శివన్న, సుధీర్‌కుమార్, రమిజాబీ, సంధ్యారాణి పాల్గొన్నారు.


బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పథకాల అమలులో కాలయాపన తగదు

నందికొట్కూరు: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలు అమలులో కాలయాపన తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తాము నిర్వహించిన ప్రజాచైతన్య కార్యక్రమంలో రోడ్లు, డ్రైనేజీలు, పింఛన్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, రేషన్‌కార్డులు, మంచినీటి తదితర సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెచ్చారన్నారు. సమస్యలను పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నామన్నారు. ఉపాధి కూలీలకు మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న చిన్నపాటి ఉద్యోగులు వీఓఏలను, మధ్యాహ్న భోజన నిర్వాహకులను, అంగన్‌వాడీ వర్కర్లను, ఆయాలను, ఫీల్డ్ అసిస్టెంట్లను రాజకీయ కక్షతో తొలగించడం సబబు కాదన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఉస్మాన్‌బాషా, నాయక్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ అనితమ్మపై శుక్రవారం సచివాలయంలో ఏపీడీ అన్వరాబేగం విచారణ నిర్వహించారు. పని కల్పించడానికి డబ్బు అడుగుతుందని, పనికి రాని వారికి కూడా మస్టర్ వేస్తుందని గ్రామానికి చెందిన కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేసినట్లు ఏపీడీ తెలిపారు. ఈ విషయాలపై విచారణ చేయగా అలాంటిదేమీ లేదని తేలిందన్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. విచారణలో సర్పంచు రామస్వామి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ విమలమ్మ, టీఏ శ్రీధర్ పాల్గొన్నారు.


విచారణ నిర్వహిస్తున్న ఏపీడీ అన్వరాబేగం

సీతారామ లక్ష్మణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని సీతారామ లక్ష్మణ స్వామి ఆలయంలో పురోహితులు లక్ష్మీనరసయ్య శర్మ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ట పూర్తి చేసుకుని 41 రోజులైన సందర్భంగా స్వామి వార్లకు కుంకుమార్చన, ఆకు పూజ, అభిషేకాలు, హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


ఆలయంలో సీతారాముల విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం


విద్యుత్‌బల్బుల వెలుగుల్లో శ్రీరాముని ఆలయం

శ్రీరామనవమికి ఆలయం ముస్తాబు

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో ఈనెల 6, 7 తేదీలలో నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు రామాలయం ముస్తాబైంది. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు గ్రామస్తుల సహకారంతో ఆలయానికి రంగులు వేయించి, విద్యుత్ లైట్లతో అలంకరించి, రథాన్ని సిద్ధం చేస్తున్నారు. ఆదివారం రోజున వేదపండితులు, పురప్రముఖుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం, సోమవారం ఉత్సవమూర్తుల విగ్రహాల పల్లకీసేవ, రథోత్సవ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

భక్తిశ్రద్ధలతో సుంకులాపరమేశ్వరికి బోనాలు



ప్రత్యేక అలంకరణలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు, బోనాలతో మహిళలు

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామంలో సుంకులాపరమేశ్వరి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. రెండు రోజులుగా అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి నవవిధ అభిషేకం, లలితా హోమం, శ్రీసూక్తా, దుర్గా సూక్తా హోమం, రుద్ర హోమం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, మంత్ర పుష్పం, వేద ఆశీర్వాదం పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఇంటి నుంచి బోనాలతో బయల్దేరి అమ్మవారికి సమర్పించారు. ఈ క్రమంలో సుంకులమ్మ కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఊరంతా బంధువులతో సందడి నెలకొంది.

రేపు పౌరాణిక నాటక ప్రదర్శన

పాములపాడు: మండలంలోని క్రిష్ణానగర్ గ్రామంలో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఈనెల 6న నాటక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు రామాలయం కమిటీ సభ్యులు తిమ్మారెడ్డి, రవీంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ విరాట్‌పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీకృష్ణుడి పడకసీను, చింతామణి భవాని సీను, సత్య హరిశ్చంద్రలో(వేట సీను, వారణాసి సీను, కాటి సీను) నాటకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా దేవి అమ్మవారికి శుక్రవారం కొబ్బరి కాయలు సమర్పించారు. ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు.

మిడుతూరు ఏపీఓగా నాగమ్మ

నందికొట్కూరు: ఉపాధి హామీ పథకం ఏపీఓగా నాగమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ దశరదరామయ్య తెలిపారు. ఆత్మకూరు ఏపీఓ పని చేస్తూ బదిలీపై మిడుతూరు మండల ఏపీఓగా విధుల్లో చేరారని చెప్పారు. ఈసీగా నందికొట్కూరు నుంచి షభాన, టెక్నికల్ అసిస్టెంట్లు జూపాడుబంగ్లా నుంచి ఇజ్రాయేల్‌రాజ్, సబితారాణి, నందికొట్కూరు నుంచి ఉమా మహేశ్వరయ్య, గడివేముల నుంచి శ్రీవాణి, సీఓ శేషగిరిరావు, శ్రీనివాసరెడ్డి బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి

నందికొట్కూరు: గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని దామగట్ల, 10 బొల్లవరం, బ్రాహ్మణకొట్కూరు, అల్లూరు తోపాటు ఆయా గ్రామాలకు చెందిన దాతలు సహకరిస్తే సీసీ కెమెరాలు ఏర్పాటు శులభమవుతుందన్నారు.

అప్పుదారులను వేధిస్తే కేసులు

నందికొట్కూరు: అప్పు తీసుకున్న మహిళలను ఇబ్బందులకు గురి చేసే ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. స్పందన ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకున్న ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. మహిళలను అప్పు చెల్లించాలని స్పందన ఫైనాన్స్ వారు ఒత్తిడికి గురి చేసినట్లు విచారణలో తేలితే క్రిమినల్ కేసులు తప్పవన్నారు.

వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం


ఇలియాస్ ఖాన్

వెలుగోడు: వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ కో- ఆప్షన్ మెంబర్ ఇలియాస్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లింలతోపాటు లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నప్పటికీ ఎన్డీఏ దాని మిత్రపక్షాలు ఆ బిల్లుకు మద్దతు ఇచ్చి ముస్లింలను మోసగించాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లింల పక్షపాతి అని చెప్పుకుంటూనే ముస్లిం వర్గాలు వ్యతిరేకిస్తున్న బిల్లుకు మద్దతు పలికి రాష్ట్ర ముస్లిం మైనార్టీలను మోసగించారన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ దేశంలోని ఎన్డీఏ వ్యతిరేక రాజకీయ పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీలో ఉన్న ముస్లిం నాయకులు రాజీనామా చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షంషీర్ అలీ, జాకీర్, ఆరిఫ్, మూర్తుజావలి ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

పాములపాడు: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. శుక్రవారం బస్టాండ్ సెంటరులో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి, వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. మైనర్లకు మరోసారి వాహనాలిస్తే తల్లిదండ్రులే శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

పోలీసు స్టేషన్‌లో అనుమతి తప్పనిసరి

వక్ఫ్ చట్టం సవరణపై నిరసన వ్యక్తం చేయదలిచిన వారు తప్పని సరిగా పోలీసు స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. శుక్రవారం ముస్లిం మత పెద్దలతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, శాంతియుతంగా నిరసన తెలపాలనుకుంటే అనుమతి తీసుకోవాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కమిషనర్ నిరంజన్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు ఆమె వెంట ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళిత సంఘాల నాయకుల చొరవతో ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని విగ్రహ ఏర్పాటు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాతో కూడా చర్చించినట్లు వెల్లడించారు. కలెక్టర్ వెంట దళిత సంఘాల నాయకులు బాలస్వామి, అనిల్ అమృతరాజ్, లక్ష్మీదేవి, ప్రేమ్‌కుమార్, లింగస్వామి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

విజేతలకు బహుమతుల ప్రదానం

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన న్యూకేటగిరి విభాగం రాతిదూలం పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతి నాగరకర్నూల్ జిల్లా చంద్రకళ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు వృషభాలు, రెండో బహుమతి నంద్యాల జిల్లా వనికందిన్నెకు చెందిన పెద్ద సరబయ్య, మూడో బహుమతి మల్లెలకు చెందిన మహిమున్నా, నాల్గో బహుమతి కొత్తపల్లెకు చెందిన వెంకట హారిక, ఐదో బహుమతి ప్రకాశం జిల్లా మర్రివేములకు చెందిన మల్లేశ్వరి, ఆరు, ఏడు బహుమతులు చాబోలికి చెందిన మహమ్మద్‌రఫీ వృషభాలు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేల చొప్పున బహమతులు ప్రదానం చేశారు. పీవీ కుమార్‌రెడ్డి, పీవీ నాగార్జునరెడ్డి, వెంగన్న, రమణారెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.


వృషభ యజమానులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీశైలంలో రేపు సీతారాముల కల్యాణం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహా క్షేత్రం అనుబంధంగా ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 6న శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారామ చంద్రస్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ ఎం శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహాగణపతి పూజ అనంతరం వృద్ధి, అభ్యుదయాలను కాంక్షిస్తూ పుణ్యాహవచనం, కంకణపూజ, కంకణధారణ, యజ్ఞోపవీతపూజ, యజ్ఞోపవీతధారణ, నూతన వస్త్ర సమర్పణ, వరపూజ, ప్రవర పఠన, గౌరీపూజ, మాంగళ్య పూజ, సీతాదేవివారికి మాంగళ్య ధారణ, తలంబ్రాలు మొదలైన కార్యక్రమాలతో సీతారామ కల్యాణం జరిపించనున్నట్లు తెలిపారు.

7న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

జూపాడుబంగ్లా: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 7న మండలంలోని తూడిచెర్ల గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన విజేత ఎడ్ల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచినవారు 9849891875కు ఫోన్‌చేసి 6వ తేదీ సాయంత్రంలోగా రూ.600 ప్రవేశరుసుం చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.